క్లుప్తంగా

నమో సత్యదేవాయ



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ స్థాన అర్చకుడు వెంకటరమణానంద ఆచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు ప్రదీప్ చంద్ర, సహాయ అర్చకుడు తాతయ్య ఆచార్యులు భక్తులతో వ్రతాలు చేయించారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, రామలక్ష్మి, స్వాతి, జానకి, ఉషారాణి, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, వంశీరెడ్డి, దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం 35వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్ప దేవన్‌రెడ్డి ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో గాజువాక వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు సాయం



ఎంబీబీఎస్ కోచింగ్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న రామఅప్పారావు, దాతలు

అగనంపూడి: నిరుపేద విద్యార్థి చదువుకు అగనంపూడి ప్రాంతానికి చెందిన దాతలు దన్నుగా నిలిచారు. మునగపాకకు చెందిన కాండ్రేగుల జనార్దన్ కుమారుడు కుమార వెంకట శివ రామజోగి పదో తరగతి, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచాడు. నీట్ రాసి ఎంబీబీఎస్ చదవడానికి పేదరికం అడ్డంకిగా మారడంతో తన స్థితిని అగనంపూడికి చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామఅప్పారావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన రామ అప్పారావు నీట్ కోచింగ్‌కు అవసరమైన రూ.33వేలు సమకూర్చడానికి ముందుకు వచ్చారు. ముందుగా రూ.11వేలు అందివ్వగా, ఆదివారం మరో రూ.15వేల డీడీని విద్యార్థికి అందించారు. దాతలు నిమ్మకూరి రమేష్, బొండా ఈశ్వరరావు, గుదే సుశీలా గజేంద్రరావు, తాండవలక్ష్మి వాసు, బందారు చందు, సాలాపు సూరిబాబు, విందుల వెంకటరమణ, గవర సోమశేఖర్, మజ్జి శ్రీను, పాముల వసంత్, పట్టా శ్రీను,టీఎల్ఎన్‌రావు పాల్గొన్నారు.

దేదీప్యమానం.. బాలాజీ దివ్యక్షేత్రం



సహస్ర దీపాలంకరణలో శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం సహస్ర దీపాలంకరణతో వెలిగిపోయింది. ఎక్కడ చూసినా దీపాల వెలుగులు విరజిమ్మాయి. షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడు సహస్ర దీపాల నడుమ ఊయల సేవలో తరించారు. వేలాది మంది భక్తులు తిరుమలేశుడిని చూసి పులకించిపోయారు.

యారాడ చూసొద్దాం.. రారండోయ్..



కొండలపై కనువిందు చేస్తున్న కొబ్బరి చెట్లు

చుట్టూ కొండలు.. పచ్చని చెట్లు.. ఆహ్లాదం పంచే రోడ్డు.. విశాలమైన తీరం యారాడ సొంతం. ప్రకృతి అందాలు.. **ఇసుక తిన్నెలు** చూసి తరించడానికి యారాడ **తీరం** ఆహ్వానం పలుకుతోంది. గంగ**వరం ఘాట్** రోడ్డు ఒంపులు పర్యాటకుల**ను మరింత** ఆకర్షిస్తున్నాయి. దీంతో యారా**డ తీరం** ప్రతిరోజూ పర్యాటకులతో క**ళకళలాడుతూ** ఉంటోంది. కార్తీక మాసం కా**వడంతో ఈ** తీరానికి పర్యాటకుల తాకిడి **మరింత** పెరిగింది. –పెదగంట్యాడ



యారాడ బీచ్‌లో పర్యాటకుల సందడి



- పరవశించేలా ప్రకృతి అందాలు
- ప్రత్యేక అనుభూతి ఘాట్‌రోడ్ ప్రయాణం
- పర్యాటకులను ఆకర్షిస్తున్న సాగర తీరం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

గాజువాక, మల్కాపురం, సింధియా ప్రాంతానికి చెందిన వారే కాకుండా అనకాపల్లితో పాటు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు యారాడ తీరానికి వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడుపుతారు. కార్తీక మాసంలో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరంతా ప్రకృతి అందాలను తిలకిస్తూ.. ఇసుక తిన్నెల్లో ఆటలాడుతూ.. సముద్ర అలలతో సయ్యాటలాడుతూ పరవశించిపోతారు. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి కూడా పర్యాటకులు యారాడకు క్యూ కడుతున్నారు.



యారాడ తీరానికి వెళ్లే ఘాట్‌రోడ్డు

ఫొటో షూట్‌లకు అనుకూలం



ఫొటో షూట్‌లకు యారాడ తీరం చాలా అనువైన ప్రదేశం. పిక్నిక్ ఏర్పాటు చేసుకునేవారికి ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆటలు ఆడుకునేందుకు, సంతోషంగా తిరిగేందుకు చుట్టూ కొండలు, కొబ్బరి చెట్లు ఉన్నాయి.తీరం వంపు, పచ్చదనం ఆనందంతో పాటు ఆహ్లాదం పంచుతాయి. పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేస్తారు.

– కులుకూరి వాసు, నడుపూరు

ఆహ్లాదకర ప్రదేశం



యారాడ తీరం పిక్నిక్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. సెలవుల సమయంలో కుటుంబంతో వచ్చి ఆహ్లాదకరంగా గడిపేందుకు చాలా అనువైన ప్రదేశం. చుట్టూ కొండలు, పచ్చని వాతావరణంతో పాటు తీరానికి వెళ్లే వంపులు తిరిగిన ఘాట్‌రోడ్డు మయమరిపిస్తాయి. ఈ వాతావరణం సందర్శకుల మనసును దోచుకుంటుంది.ఎన్ని సార్లు వెళ్లినా మళ్లీ మళ్లీ వెళ్లాలనిపించే ప్రదేశం యారాడ తీరం.

– జి బాలాజీ, పెదగంట్యాడ

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు మల్లికేశ్వరరావును సన్మానిస్తున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు బెల్ సిగ్నల్ పాయింట్ దరి రాంనగర్‌లో విశాఖ జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అతికినెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కూనూరు మల్లికేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలిగా రొంగలి వర్ధిని, ఉపాధ్యక్షుడిగా ఈమంచి త్రినాథరావు, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి రామకృష్ణ, కోశాధికారిగా ఎర్రంశెట్టి గౌరీశంకర్, సహాయ కార్యదర్శిగా పిల్లా ప్రసాద్, న్యాయసలహాదారుగా తెలగారెడ్డి పుల్లయ్య నాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బొడ్డు సాంబశివరావు, కుడుపూడి శ్రీనివాసరావు, బేతా రాజు, లక్ష్మీనారాయణ, రసూల్, వత్తార్, హరి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ గేటు శివాలయంలో వనభోజనం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో సోమవారం కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నిర్వహించనున్న అన్న సమారాధనకు పెదగంట్యాడ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యేందుకు సీఐఎస్ఎఫ్ అధికారులు అనుమతి ఇచ్చారు. శివాలయానికి వచ్చే భక్తులు బీసీ గేటు వద్ద తమ ఆధార్ కార్డులు సమర్పించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, ఎల్లేటి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్,ధర్మాల కనకరెడ్డి తెలిపారు.

బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గ సభ్యులు

గాజువాక: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అనకాపల్లి సెంటర్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. గాజువాకలోని ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కందేరి శేఖర్ బాబు, కార్యదర్శిగా కె.అశోక్ కుమార్, ఈసీ సభ్యుడిగా కె.నాగిరెడ్డితో పాటు కమిటీ సభ్యులతో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎ.నాగమల్లేశ్వరరావు, చెరువు రామకోటయ్య, బి.రాఘవరావు, నెక్కలపు నాగేశ్వరరావు, ఎ.కాశీ విశ్వేశ్వరరావు, పెనుమత్స అప్పలరాజు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్ షిప్‌లో పిక్నిక్ సందడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం కార్తీక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సెక్టార్-6లోని ఉమామహేశ్వర దేవాలయంలో ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కూర్మన్నపాలెం నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు జి.వి.ఎన్. ప్రసాద్, గణేష్‌లు సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో వందలాది మంది పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉక్కునగరం దేవాలయాల అసోసియేషన్ కార్యదర్శి ఆచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న బాలికలతో సీజీఎం శ్రీధర్



అన్నసమారాధనలో పాల్గొన్న ఉక్కు నగరవాసులు

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



మహాధర్నాలో పాల్గొన్న రైతులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల హక్కులను కాపాడడంతో పాటు వారికి చట్టపరంగా సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ ఎదుట ఆదివారం మహాధర్నా చేపట్టారు. కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ పాల సేకరణ ధర పెంచాలని... కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ కో–ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, డెయిరీ కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష రుద్రాక్ష పూజ నేడు

ఉక్కునగరం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించనున్నారు. కార్తీక బహుళ దశమి, ఉత్తరా నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు ఈ పూజ నిర్వహిస్తారు. అయ్యప్ప దీక్ష స్వీకరించిన స్వాములు పూజలో పాల్గొని స్వామి అనుగ్రహం పొందాలని ఆలయ ప్రధానార్చకుడు నాగేశ్వరశర్మ కోరారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధాశ్రమంలో చేర్పించిన మహిళ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆదివారం అనాథ వృద్ధ మహిళను వృద్ధాశ్రమంలో చేర్పించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలు.. కుక్క విశాఖ విమల విద్యాలయం సమీపంలో వృద్ధురాలు సంచరించడం గమనించి పోలీసు కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన సమాచారం మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు విమల విద్యాలయానికి చేరుకునిడ ఆమెను ప్రశ్నించగా ఎటువంటి సమాచారం ఇవ్వలేక పోయింది. దీంతో ఆమెను నగరంలోని వృద్ధాశ్రమంలో చేర్పించారు.

సత్యసాయి శతాబ్ది జయంత్యుత్సవాలు ప్రారంభం



సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరిస్తున్న బాలవికాస్ చిన్నారులు



సత్యసాయి భజన మండలి ప్రతినిధులను సత్కరిస్తున్న సత్యసాయి భక్తులు

భక్తిశ్రద్ధలతో పూజలు, సేవా కార్యక్రమాలు

అగనంపూడి: సత్యసాయి శతాబ్ది జయంత్యుత్సవాలు అగనంపూడిలో ఆదివారం ప్రారంభించారు. సత్యసాయి బాబాను భజనలతో కొలిచారు. అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలోని బాల వికాస్ కేంద్రంలో ఉదయం ఓంకారం, వేదపారాయణం, అష్టోత్తర శతనామావళి, నామ సంకీర్తన, తర్వాత ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. వంద మంది బాల వికాస్ పిల్లలు సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరించారు. సత్యసాయి బాబా వేషధారణలో చిన్నారులు అలరించారు. ఆధ్యాత్మిక విభాగం సమన్వయకర్త జయగౌరీ కామేశ్వరి, జయశ్రీలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యసాయి ఉక్కునగరం కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ అగనంపూడి సత్యసాయి భజన మండలి సారథ్యంలో మొట్టమొదటసారిగా ఉత్సవాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అగనంపూడి కోఆర్డినేటర్ విందుల రామారావు, భజన మండలి ప్రతినిధులు కేఆర్‌కేరాజు, కె.ఎస్.ఎన్.రాజు, వి.మహేష్, బి.వి.సుబ్బారావు, అల్లం శ్రీనివాస్, బొండా ఈశ్వరరావు, సాయి సరస్వతి, అల్లం రమాదేవి, విందుల పద్మలత, అరుణ, కళావతి పాల్గొన్నారు.



సత్యసాయి వేషధారణలో ఉన్న బాలుడి చుట్టూ సాయి నామం జపిస్తున్న భక్తులు

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

పెదగంట్యాడ: మండలంలోని వికాస్‌నగర్‌లో ఓ వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును దొంగ తెంచుకుపోయాడు. న్యూపోర్టు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో వుడా ఎంఐజీలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శెట్టి రాంబాయి (75) అనే మహిళ ఒంటరిగా నివాసం ఉంటోంది. శనివారం ఆమె మిక్సీ బాగు చేయించుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చింది. ఇంట్లోని వంట గదిలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు తెంచుకుపోయాడు. ఆ సమయంలో ఆమె చేతి వేలికి గాయమైంది. వెంటనే ఆమె న్యూపోర్టు క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి ఫొటోను విడుదల చేశారు. నిందితుని వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



చోరీకి పాల్పడిన నిందితుడి సీసీ కెమెరా దృశ్యాలు

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభమై జీవీఎంసీ దరి గాంధీ బొమ్మవరకు కొనసాగుతుందని తెలిపారు. కార్మికులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కెంగువ అచ్యుతరావు, జి.ఆనంద్, సతీష్, శంకర్, శివ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీనాయకులు

ప్రైవేట్ వాహనాల అడ్డాగా ఆటోనగర్



ఆటోనగర్ బి - బ్లాక్ సర్వీస్ రోడ్డు పక్కన దర్జాగా పార్కింగ్ చేసిన ప్రైవేట్ వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఆటోనగర్ అడ్డాగా మారిపోయింది. ఆటోనగర్ బి – బ్లాక్ సర్వీసు రోడ్డు పక్కన ఏపీఐఐసీ డీజెడ్ఎం కార్యాలయం పక్కన పలు లారీలు, ఆయిల్ ట్యాంకర్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. మరి కొందరు అనధికారికంగా మెకానిక్ షాపులు నిర్వహిస్తున్నారు. అయినా ఐలా సిబ్బంది పట్టించుకోక పోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా పార్కింగ్ చేయడం వల్ల రోడ్డు ఇరుగ్గా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆటోనగర్‌లో రోడ్డు పక్కనున్న స్థలాలను పరిరక్షించి వృక్షాలు పెంచి కాలుష్యాన్ని అరికట్టడానికి ఉపయోగించాలని కోరుతున్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ. 40 వేలు అందజేత

గాజువాక: క్యాన్సర్‌తో బాధపడుతున్న దున్న రామకృష్ణకు గాజువాకకు చెందిన విశాఖ థ్రిల్లర్స్ బి.వెంకట్ ఆర్థిక సహాయం అందజేశారు. విజయనగరం వెళ్లి బాధితుడిని పరామర్శించిన వెంకట్ ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు రూ.40వేల నగదు అందజేశారు.



బాధితుడికి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వెంకట్